సాక్షి నిజామాబాద్

మంగళవారం ; 7 ; మార్చి ; 2023



ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



గోదాముల సంఖ్య పెంచాలి

బోధన్, బాన్సువాడ ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకు అనుగుణంగా గోదాములు పెంచాలని రైస్‌మిల్లర్లు కోరారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /20.8

వాతావరణం

ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యం అందించాలి



బాల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. సోమవారం మెండోరాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పరిశుభ్రతలను పరిశీలించారు. రోజుకు ఎంత మంది ఓపీ ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా సమష్టిగా కృషిచేయాలన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మహిళల ఆరోగ్య మెగా మేళాను విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో సుదర్శనం, డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రమోహన్, వైద్యాధికారిణి ప్రణవ, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి తదితరులున్నారు.

రేపు మార్కెట్‌లో యథావిధిగా లావాదేవీలు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): వ్యవసాయ మార్కెట్ 8వ తేదీన తెరిచే ఉంటుందని, పంటల క్రయ విక్రయాలు జరుగుతాయని మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి 9వ తేదీన తెరవాల్సిన మార్కెట్‌ను అదనపు కలెక్టర్ ఆదేశాలతో 8న వ్యాపార లావాదేవీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని రైతులు ఈ విషయాన్ని గమనించి పంటలను మార్కెట్‌కు తేవాలని సూచించారు.

లండన్‌లో ఇందూరు యువకుడి సదస్సు

- పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరానికి చెందిన 'ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూకే చాప్టర్' స్పోక్స్‌పర్సన్ సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో లండన్‌లోని హ్యాస్టన్‌లో ఆదివారం రాత్రి సదస్సు నిర్వహించారు. సదస్సుకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా శ్యామ్ పిట్రోడా, మధుయాష్కి హాజరయ్యారు. లండన్‌లో ఉంటున్న భారతీయులు వేలాదిగా తరలివచ్చారు. భారతదేశ భవిష్యత్తు, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి అవకాశాలపై రాహుల్‌గాంధీ ఈ సదస్సులో ప్రసంగించారు. కార్యక్రమంలో యూకే ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షులు కమల్ దాలివాల్ పాల్గొన్నారు. నిజామాబాద్‌కు చెందిన సుధాకర్‌గౌడ్ అన్నీ తానై సదస్సు విజయవంతానికి కృషి చేయడంపై రాహుల్ గాంధీ అభినందించారు.

నిజాంసాగర్ నీటి విడుదల నిలిపివేత

నిజాంసాగర్: ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను సోమవారం నిలిపివేశారు. ప్రాజెక్టునుంచి ఆయకట్టుకు ఇప్పటివరకు నాలుగు విడతల్లో 7.537 టీఎంసీల నీరందించారు. మొదటి దఫా డిసెంబర్ 14 నుంచి జనవరి 1 వరకు 2.493 టీఎంసీల నీటిని ప్రధాన కాలువకు విడుదల చేశారు. రెండో విడతలో జనవరి 13 నుంచి జనవరి 23 వరకు 1.365 టీఎంసీలు అందించారు. మూడో విడతలో గతనెల 2 నుంచి 13 వ తేదీ వరకు 1.714 టీఎంసీలు వదిలారు. గతనెల 23 నుంచి ఈ నెల 6 వ తేదీ వరకు నాలుగో విడతలో 1.963 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

మరో రెండు విడతలు..

నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. సోమవారం సాయంత్రానికి 1,397.04 అడుగుల(8.462 టీఎంసీలు) నీరుంది. ఆయకట్టుకు ఇప్పటివరకు నాలుగు విడతల్లో నీటిని విడుదల చేశారు. ఇంకా రెండు విడతల నీరందించాల్సి ఉంది.

నేడు తేలికపాటి వర్ష సూచన

రుద్రూర్: ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. రైతులు రెండు రోజుల వరకు పొలాల్లో రసాయన మందులు పిచికారీ చేయకుండా వాయిదా వేసుకోవాలన్నారు.



ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీచౌక్‌లో కాముడి దహనం చేస్తున్న ప్రజలు

ఘనంగా కామదహనం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం కాముడి దహనం నిర్వహించారు. కాగా గ్రామీణ ప్రాంతాల్లో హోలీ వేడుకలు చేసుకున్నారు. నగరంతో పాటు వివిధ పట్టణాల్లో నేడు జిల్లా వ్యాప్తంగా హోలీ సంబురాలు జరుపుకోనున్నారు. ఇందుకోసం ప్రజలు మార్కెట్‌లో రంగులను కొనుగోలు చేశారు.

అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట



వేల్పూర్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

- మహిళల కోసం కేసీఆర్ సంక్షేమ పథకాలు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తు న్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ సర్కారు మాత్రమేనని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేల్పూర్ సాయి బాబా ఆలయం వద్ద బాల్కొండ నియోజకవర్గ అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, వీవోఏలు, ఆశ వర్క ర్లు, ఆయన సతీమణి నీరజారెడ్డితో కలిసి నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సాధి కారత కోసం సీఎం కేసీఆర్ మాదిరిగా ప్రపంచంలో మరెవరూ ఆలోచన చేయలేరని చెప్పారు. బిడ్డ కడుపులో ఉన్నప్పుడు కేసీఆర్ కిట్‌తో మొదలు వృద్ధాప్యంలో ఆసరా పెన్షన్ వరకు ఎన్నో మానవీయ కోణ కార్యక్రమాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, హోంగార్డులు, ఆరోగ్యకార్యకర్తలకు జీతాలు రెట్టింపుకంటే ఎక్కువ అయ్యాయన్నారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని సీఎం కేసీఆర్ ప్రగాఢంగా విశ్వసిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మధుశేఖర్, ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్, వేల్పూర్ ఎంపీపీ భీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, సర్పంచ్ తీగెల రాధామోహన్, ఏఎంసీ చైర్మన్ అరుణ, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రేడ్ ఫీజులు ఎగ్గొట్టారు..!

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏ వ్యాపార వాణిజ్య సంస్థ ఏర్పాటు చేసినా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతియేటా ట్రేడ్ లైసెన్సు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ నగరంలోని సగానికిపైగా ప్రైవేటు ఆస్పత్రులు చెల్లించడం లేదు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. మరికొన్ని ఆస్పత్రులు ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లిస్తున్నా మున్సిపాలిటీ పరిధిలోని శానిటేషన్ విభాగం అధికారులు ఆ డబ్బులను కట్టకుండా జేబులో వేసుకుంటున్నారు. ఫలితంగా నగర కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ఈ తతంగం గత కొన్నేళ్లుగా సాగుతోంది.

- నగరంలో ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించని అత్యధిక ఆస్పత్రులు
- కొన్ని హాస్పిటళ్లు చెల్లించినా జేబులో వేసుకున్న శానిటేషన్ అధికారులు
- మున్సిపల్ ఆదాయానికి గండి

నగరంలో రాజు అనే వైద్యుడు(పేరుమార్చాం) తన ఆస్పత్రికి సంబంధించి ప్రతి ఏడాది నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించాడు. ఫీజు డబ్బులను మున్సిపల్ శానిటేషన్ విభాగానికి చెందిన అధికారులకు ఇచ్చాడు. కానీ అతడికి ఎలాంటి రశీదు ఇవ్వలేదు. అధికారులు డబ్బులు వసూలు చేసినా మున్సిపాలిటీకి చెల్లించలేదు. దీంతో మున్సిపాలిటీ ఆదాయాన్ని కోల్పోతోంది.

వైద్యారోగ్య శాఖలోని ఓ అధికారి నగరంలోని ఖలీల్‌వాడిలో గల మోడ్రన్ పబ్లిక్ స్కూల్ సమీపంలో వైద్యారోగ్యశాఖ అనుమతులు లేకుండానే గైనిక్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా మున్సిపల్ నుంచి కూడా ఎలాంటి అనుమతి లేకున్నా దర్జాగా నడుపుతున్నారు. అయినా మున్సిపాలిటీలోని శానిటేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు. అనుమతి లేకుండా నడుపుతుండడంతో మున్సిపల్ ఆదాయానికీ గండిపడుతోంది.



ఖలీల్‌వాడిలోని ప్రైవేటు ఆస్పత్రులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సుమారుగా 250కి పైగా ఆస్పత్రులు ఉన్నాయి. వీటితో పాటు సుమారుగా 1200 మెడికల్ దుకాణాలు ఉన్నాయి. ల్యాబ్‌లు ఇతరాత్ర వ్యాపార సంస్థలున్నాయి. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం వీరు అనుమతి తీసుకొని ప్రతి ఏడాది ట్రేడ్‌లైసెన్సు ఫీజు చెల్లించాలి. 2022 సంవత్సరం వరకు ప్రతి ఏడాది ట్రేడ్‌లైసెన్సు ఫీజు సుమారుగా రూ. 20వేల నుంచి రూ. 30వేల వరకు ఉండేది. మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులైతే రూ. 40వేల లోపు ఉండేది. చిన్నచిన్న ఆస్పత్రులైతే రూ. 10వేల ఫీజు ఉండేది. కానీ ప్రైవేటు ఆస్పత్రులు సగానికి పైనే ఫీజులు చెల్లించకుండా ఎగ్గొడుతున్నాయి. మరికొన్ని చెల్లిస్తున్నా అంతంత మాత్రంగానే ఆదాయం వస్తోంది. అయితే ఫీజు వసూలు చేయాల్సిన సంబంధిత శానిటేషన్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.

ఉచితసేవ చేస్తేనే ఫీజు మినహాయింపు

ప్రజలకు ఉచిత సేవ చేస్తేనే ట్రేడ్ లైసెన్సు నుంచి మినహాయింపు ఉంటుందని మున్సిపల్ నూతన చట్టం చెబుతుంది. దీని ప్రకారం ప్రైవేటు ఆస్పత్రులు కచ్చితంగా ట్రేడ్‌లైసెన్సు ఫీజు చెల్లించాలి. కొత్త చట్టం ప్రకారం కొలతలు వేసి ఫీజు కట్టాల్సి రావడంతో అందరి కళ్లు తిరిగాయి. ఎందుకంటే గతంలో రూ. 30వేల లోపు ఉన్న ఫీజు ఇప్పుడు రూ.లక్షా 50వేలకు పైన కట్టాల్సి రావడంతో ఇదేమిటని మదనపడ్డారు. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రులు కోర్టుకు వెళ్లడంతో, నగరంలోని ప్రైవేటు ఆస్పత్రులు సైతం ఐఎంఏ ద్వారా కోర్టుకు వెళ్లాయి. అయితే కరీంనగర్, సిద్దిపేట, తదితర జిల్లాల్లోని ప్రైవేటు ఆస్పత్రులు ఫీజులు చెల్లిస్తుండగా ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రులు మాత్రం నిరాకరిస్తున్నాయి.

ఆదాయానికి గండి కొట్టారిలా..

మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడంలో ముఖ్యపాత్ర శానిటేషన్ అధికారులదేనని అందరూ చర్చించుకుంటున్నారు. మామూలుగా వ్యాపార సంస్థల నుంచి శానిటేషన్ అధికారులు ఫీజులు వసూలు చేస్తారు. అయితే నిబంధనల ప్రకారం కొన్ని ఆస్పత్రులు ఫీజులు చెల్లిస్తున్నా కక్కుర్తి పడిన అధికారులు తమ జేబుల్లోకి వేసుకుంటున్నారు. ఆస్పత్రుల నుంచి డబ్బులు వసూలు చేసి, వారికి రశీదు ఇవ్వకుండా, మున్సిపాలిటీకి చెల్లించకుండా తమ జేబులు నింపుకున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే తతంగం కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం రూ. 60లక్షల నుంచి రూ. కోటి వరకు మున్సిపాలిటీకి ఆదాయం రావాల్సి ఉండేది. కానీ ప్రతి ఏడాది కేవలం రూ. 6 లక్షల్లోపు ఆదాయం మాత్రమే వచ్చేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ట్రేడ్ ఫీజులు ఎగ్గొట్టారనేది, కొన్ని ఆస్పత్రులు చెల్లించినా అధికారులు జేబులో వేసుకున్నారనేది స్పష్టమవుతోంది. ఇలా కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం రాకుండా గండికొట్టారు.

తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శం



బాల్కొండలో పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ

- రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఢోకా లేదు
- హోం శాఖ మంత్రి మహమూద్ అలీ
- బాల్కొండలో నూతన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభం

బాల్కొండ: శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శమని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం బాల్కొండలో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రివేముల ప్రశాంత్‌రెడ్డి, డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పోలీసుల పనితీరు మారిందన్నారు. పోలీసు స్టేషన్ల నిర్వహణ ఖర్చు అర్బన్ ఏరియాల్లో నెలకు రూ.75 వేలు, రూరల్ ఏరియాల్లో రూ. 15 వేలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇది దేశంలో ఎక్కడా లేదన్నారు. దేశంలోనే బడ్జెట్‌లో మిగులు రాష్ట్రంగా తెలంగాణ ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత రూ. 9,598 కోట్లు వెచ్చించి నూతన పోలీస్‌స్టేషన్‌లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. పోలీస్ శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ విజన్ చాలా గొప్పదని, అందుకే 33 జిల్లాలను ఏర్పాటు చేసి పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. నూతన సచివాలయం నిర్మించడంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు.

శాంతి భద్రతలకు నిలయం..

శాంతి భద్రతలకు నిలయం తెలంగాణ రాష్ట్రమని, శాంతి భద్రతలు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల మెరుగునకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత పోలీసుల సంక్షేమం కోసం రాష్ట్రం ఎన్నో నిధులను వెచ్చించిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు రావాలంటే ప్రధానంగా శాంతి భద్రతల సమస్య ఉండకూడదన్నారు. రెండోది విద్యుత్తు, మూడోది రోడ్ల సమస్య ఉండకూడదన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఆ మూడు సమస్యలను అధిగమించామన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక సమాజంలో పోలీసులకు గౌరవం పెరిగిందన్నారు. కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నిజామాబాద్ సీపీ నాగరాజు, ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు, ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్య, సర్పంచ్ సునీత, ఆర్మూర్ రూరల్‌సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సైగోపి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రేవంత్‌రెడ్డి యాత్ర

- ఐదు నియోజకవర్గాల మీదుగా..
- ఈ నెల 11న రాత్రి బాల్కొండకు రాక
- 12న వెయ్యి మంది రైతులతో సమావేశం
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్‌సే హాథ్ జోడో యాత్ర జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కొనసాగుతుందని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి చేపట్టిన యాత్ర జగిత్యాల జిల్లా నుంచి ఈనెల 11న జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గానికి చేరుతుందన్నారు. 12న విరామం ఉంటుందని అదేరోజు బాల్కొండలో వెయ్యిమంది రైతులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు, రైతు కూలీలతో సమావేశంలో పాల్గొంటారు. సమావేశంలో రైతులు వేసిన పంటలు, వాటికి మార్కెట్‌లో రేట్లు, రైతు కూలీలకు ఇబ్బందులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో చేసిన డిక్లరేషన్‌ను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాత్రలో భాగంగా ఐదు నియోజకవర్గాల ప్రజలకు వివరిస్తారని తెలిపారు.

షెడ్యూల్ ఇలా..

- 11న బాల్కొండకు చేరుకోనున్న పాదయాత్ర
- 12న వెయ్యిమంది రైతులతో బాల్కొండలో సమావేశం
- 13న బాల్కొండ నియోజకవర్గంలో పర్యటన
- 14న నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో పర్యటన
- 15న నిజామాబాద్ అర్బన్ నియోజకర్గంలో పర్యటన
- 16న బోధన్ నియోజకర్గంలో పర్యటన
- 17న ఆర్మూర్ నియోజకవర్గంలో పర్యటన అనంతరం జిల్లాలో యాత్ర ముగుస్తుంది.

ఊరిస్తున్న మక్కల ధర..

- క్వింటాలుకు రూ. 2,200 పలుకుతున్న రేటు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మోర్తాడ్‌లో ఆరబోసిన మక్కలు

మోర్తాడ్(బాల్కొండ): యాసంగి సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు ఆశించిన ధర లభిస్తుండడం రైతుల్లో సంతోషాన్ని నింపుతుంది. వర్షాకాలం సీజన్ కంటే ఎక్కువ మక్కల ధర పలుకుతుండడంతో కొంతైనా లాభాలు దక్కుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మక్కలకు తాజాగా క్వింటాలు రూ. 2,200ల ధర లభిస్తోంది. ఇప్పుడిప్పుడే మొక్కజొన్న పంటను కోసి మక్కలను ఒలిచి రైతులు ఆరబెడుతున్నారు. వర్షాకాలం సీజన్‌లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం తగ్గించిన రైతులు యాసంగిలో గణనీయంగా పెంచారు. ఈ సీజన్‌లో జిల్లాలో దాదాపు 35వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని అంచనా. వర్షాకాలం సీజన్ కంటే యాసంగి సీజన్‌లో మక్కల దిగుబడి పెరుగుతుంది. ఇప్పుడు ఎకరం విస్తీర్ణంలోని పొలంలో 40 క్వింటాళ్ల నుంచి 45 క్వింటాళ్ల మక్కలు చేతికి అందుతున్నాయి. కోతులు, అడవి పందుల బెడద లేనిచోట రైతులకు మక్కల దిగుబడి పెరిగింది. మక్కలకు కేంద్రం క్వింటాలుకు రూ. 1,970 మద్దతు ధరగా ప్రకటించింది. మార్కెట్‌లో అంతకంటే ఎక్కువ ధర లభిస్తుండడంతో రైతులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరడంలేదు. ఎర్రజొన్నకు ప్రత్యామ్నాయంగా రైతులు మొక్కజొన్నను సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సాగు విస్తీర్ణం పెంచారు. మక్కల ఉత్పత్తులకు డిమాండ్ ఉండడంతో పాటు పౌల్ట్రీ పరిశ్రమకు మక్కల దాణా ఎక్కువగా అవసరం ఉండడంతో ధర పెరగడానికి అవకాశం లభించింది. అంతటా మొక్కజొన్న కోతలు మొదలైతే ఇదే ధర ఉంటుందా లేక ధర తగ్గుతుందా అనేది తెలియడంలేదు. మక్కలకు ఇప్పుడు లభిస్తున్న ధర యథావిధిగా ఉంటే మాత్రం తమకు ప్రయోజనమేనని రైతులు చెబుతున్నారు.

'బార్' ఎన్నికల అధికారుల నియామకం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ 2023–24 సంవత్సరానికి ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల ప్రధాన అధికారిగా డి వెంకటరమణగౌడ్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా శైలేష్ కుమార్ దేష్ ముఖ్‌లను నియమించారు. ఈ మేరకు పత్రాలను బార్ ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి వారికి అందజేశారు. సోమవారం బార్ అధ్యక్షుడు ఎర్రం గణపతి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులు, న్యాయవాది మధ్య వాగ్వాదం

ఖలీల్‌వాడి: నగరంలో ట్రాఫిక్ పోలీసులు, లా యర్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సోమవారం బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ న్యాయవాది బైక్‌పై వెళ్తుండగా పోలీసులు ఆపారు. పోలీసులు సదరు న్యాయ వాది వాహనం తాళం చెవి తీసుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో సదురు న్యాయవాది వాహనాన్ని ట్రాఫిక్ పోలీసులు తీసువెళ్లే ప్రయత్నం చేయడంతో న్యాయవాది ఆపారు. ఈ విషయమై న్యాయవాది బార్ అసోసియేషన్ కార్యవర్గం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. బార్ అసోసియేషన్ సభ్యులు సీపీ నాగరాజు దృష్టికి తీసుకువెళ్లారు. బార్ అసోసియేషన్ సభ్యులతో ట్రాఫిక్ సీఐ మాట్లాడినట్లు సమాచారం. ఈ విషయాన్ని సీపీ దృష్టికి తీసుకు వెళ్తామని సీఐ చెప్పడంతో సమస్య సద్దుమణిగినట్లు తెలిసింది.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, డీపీఓ జయసుధ, డీఆర్‌డీఓ చందర్ నాయక్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులే విధిగా ప్రజావాణికి హాజరుకావాలని, ఒకవేళ అత్యవసరంగా రాలేని పరిస్థితి ఉంటే జిల్లా పాలనాధికారి అనుమతి తీసుకోవాలని సూచించారు.

కూలీలకు సదుపాయాలు కల్పించాలి

వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ప్రజావాణి అనంతరం ఆయన అధికారులతో సమీక్షించారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా తాగునీటి వసతి, నీడను కల్పించేలా తగిన ఏర్పాట్లుచేయాలని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని 8న ప్రారంభించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. 13న సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలన్నారు. ఇంటర్మీడియట్, పదోతరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, లోటుపాట్లకు ఆస్కారం లేకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు.

కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగిన పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 462 మంది విద్యార్థులకు 435 మంది హాజరు కాగా 27మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 562 మందికి 528 పరీక్ష రాశారు. ఉదయం జరిగిన ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 36 మంది విద్యార్థులకు 24 మంది, మధ్యాహ్నం జరిగిన ఎల్‌ఎల్‌బీ ఐదో సెమిస్టరు పరీక్షలో 24 మంది 21 మంది హాజరైనట్లు వివరించారు. క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బి విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి పరిశీలించారు.

రూ.2500 కోసం గొడవ

- కల్లుబట్టీలో ఒకరి హత్య


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ

ఖలీల్‌వాడి: నగరంలోని నాగారం పాత కల్లు బట్టీలో ఒకరు హత్యకు గురయ్యారు. నార్త్ సీఐ నరహరి తెలిపిన వివరాలు.. నాగారం ప్రాంతానికి చెందిన వట్టేవార్ యాదు(40), అదే కాలనీకి చెందిన విక్రమ్ సింగ్ సోమవారం ఉదయం స్థానిక బెల్ట్‌షాపులో మద్యం కొనుగోలు చేసుకోని కల్లుబట్టీలో తాగారు. మద్యం తాగే సమయంలో విక్రమ్ సింగ్‌ను తనకు బాకీ ఉన్న రూ.2500 ఇవ్వాలని యాదు అడిగారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో విక్రమ్‌సింగ్ అక్కడే ఉన్న రాడుతో యాదును కణతపై కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన ప్రాంతాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్ పరిశీలించారు. హత్య వివరాలను నార్త్‌సీఐ నరహరిని అడిగి తెలుసుకున్నారు. విక్రమ్‌సింగ్ పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోయినట్లు తెలిసింది. మృతుడి కుటుంబం మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఉంటుంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామానికి చెందిన ఎనుగంటి సాయిలు అలియాస్ కరీంకు పదేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తు ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నసీమ సుల్తానా తీర్పు వెలువరించారని ఎస్సై నర్సింలు తెలిపారు. గత ఆగస్టులో అదే గ్రామానికి చెందిన సత్తూరి పుష్ప అనే మహిళను వేధిస్తు ఆమెపై కక్ష్యతో అక్రమంగా ఇంటిలోకి చొరబడి కత్తితో హత్యాయత్నం చేశాడని తెలిపారు. అప్పటి ఇన్‌చార్జి ఎస్సై వంశీకృష్ణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారని చెప్పారు. కేసులో తొమ్మిది మంది సాక్షులను విచారించి ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ అవారి రమేష్ వాదనలు వినిపించగా అసిస్టెంట్ సెషన్ జడ్జి ఈ తీర్పు వెలువరించారని ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

రుద్రూర్: రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామ చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. రుద్రూర్ గ్రామానికి చెందిన మదారి అనురాధ అలియాస్ వసంత (32) భర్త నెలన్నర క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కొంతకాలంగా పుట్టినిళ్లు అంబం (ఆర్)లో ఉంటుంది. ఆమెకు పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త లేకపోవడంతో పిల్లల భవిష్యత్తుపై బెంగతో ఉండేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురై అనురాధ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నారు. మృతురాలి తండ్రి మక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై రాజు తెలిపారు.

వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


రోషన్ మృతదేహం

నస్రుల్లాబాద్: వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. బీర్కూర్ మండల కేంద్రానికి చెంది న రోషన్ రోజూ మాదిరిగా సోమవారం తన తండ్రి గణేశ్‌తో కలిసి వాకింగ్‌కు వెళ్లాడు. తిరు గు ప్రయాణంలో తండ్రి ఇంటికి ముందుగా చేరుకున్నాడు. రోషన్ రాక పోయే సరికి ఆరా తీయగా గుర్తు తెలియని వాహనం ఢీకొని రోడ్డు పక్కన విగత జీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో మహిళ మృతదేహం


సైదవ్వ(ఫైల్)

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన సైదవ్వ (55) మృతదేహం రాయకూర్ శివారులోని నిజాంసాగర్ కాలువలో సోమవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. అక్బర్‌నగర్‌కు చెందిన బురిగెడి సైదవ్వ(55)కు కల్లు తాగే అలవాటు ఉంది. ఈ నెల 4న కల్లు తాగడానికి వర్ని వెళ్లి తిరిగిరాలేదు. సీసీ కెమెరాల్లో పరిశీలించగా బైక్‌పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్లి నట్లు గుర్తించారు. దీంతో సైదవ్వ కుటుంబ సభ్యులు రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సాగర్ కాలువలో ఆమె మృతదేహం కనిపించింది. సైదవ్వను కిడ్నాప్ చేసి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని హత్య చేసి కాలువలో పడేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గోదాముల సంఖ్య పెంచాలి


బోధన్‌లోని సీడబ్ల్యూసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులు

బోధన్‌టౌన్: బోధన్, బాన్సువాడ ప్రాంతాల్లో ఉన్న 220పైగా రైస్‌మిల్లులకు అనుగుణంగా గోదాముల సంఖ్యను పెంచాలని బాన్సువాడ డివిజన్, బోధన్ తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సోమవారం బోధన్‌లోని సీడబ్ల్యూసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆందోళనకు దిగారు. అనంతరం మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. గతేడాది యాసంగికి సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని ఈనెల 31 వరకు ఎఫ్‌సీఐకి అప్పగించాలని అధికారులు టార్గెట్ విధించారన్నారు. రైస్‌మిల్లర్లకు ఇచ్చిన సీఎంఆర్ రైస్ పంపిస్తున్నా గోదాముల్లో కెపాసిటీ లేక పోవడంతో పాటు హమాలీల కొరత ఉండడంతో లోడ్ దించుకోవడం లేదని చెప్పారు. లారీలు 10 నుంచి 20 రోజులు ఉంటున్నాయని దీంతో రూ.లక్షల్లో నష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీడబ్ల్యూసీ గోదాముల్లో 38 వేల టన్నుల కెపాసిటీ మాత్రమే ఉందని, లక్ష టన్నుల వరకు రైస్‌మిల్లర్స్ వద్ద సీఎంఆర్ ఉన్నాయని దానికి అనుగుణంగా గోదాముల వసతి కల్పించాలన్నారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబిరెడ్డి, బాన్సువాడ డివిజన్ రైస్‌మిల్లర్స్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగుల గుడిసెలు ధ్వంసం

ఎడపల్లి: మండలంలోని జానకంపేట శివారులో దివ్యాంగులు వేసుకున్న గుడిసెలను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. గ్రామ సమీపంలో 22 మంది దివ్యాంగులకు ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. ఈ స్థలాల్లో పక్కా ఇళ్లు మంజూరు అయ్యేంత వరకు గుడిసెలు వేసుకొని నివసిస్తామని ఇటీవల గుడిసెలు వేసుకున్నారు. వీటిని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయమై దివ్యాంగులు తహసీల్దార్ శేఖర్‌ని కలిసి వివరించారు.

నిందితుడి ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా


షహనాబి(ఫైల్)


ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

వర్ని: మండలంలోని బడాప హాడ్‌లో ఆదివారం రాత్రి హత్యకు గురైన షహనాబి మృతదేహంతో నిందితుడి ఇంటి ఎదుట ఆమె బంధువులు సోమవారం ధర్నా చేశారు. మండలంలోని జలాల్పూర్ గ్రామంలో షహనాబి మృతదేహంతో నిందితుడు షేక్ నిజాం ఇంటి వద్ద ఆందోళన చేశారు. షహనాబి చనిపోవడంతో ఆమె ఇద్దరు కూతుర్లు అనాథలయ్యారని, వారి బాగోగులు నిందితుడి కుటుంబ సభ్యులు చూసుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి పరిహారం ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగించారు. పోలీసులు వచ్చి నచ్చచెప్పే యత్నం చేసిన ఆందోళన విరమించలేదు. కుల పెద్దలు, గ్రామస్తులు కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కట్నం కోసం వేధించిన వారిపై కేసు

సిరికొండ:అదనపు కట్నం కోసం వివాహితను వే ధించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు సోమవారం తెలిపారు. మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన గంగరాణిని కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఒక బాబు ఉన్నాడు. రూ.పది లక్షలు అదనపు కట్నం తేవాలని గంగరాణిని ఆమె భర్త కొట్టి పుట్టింటికి పంపించాడ ని ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలు, ఆడపడుచులపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో మునిగి బాలుడి మృతి


శ్రీకాంత్ మృతదేహం

నిజామాబాద్‌సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ధర్మా రం తండా చెరువులో మునిగి కేతావత్ శ్రీకాంత్(12) మృతిచెందాడు. తండాకు చెందిన కేతావత్ అశోక్ కవితకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు. బాలుడు గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం బడి నుంచి రాగానే తన స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో గల చెరువు వద్దకు స్నానానికి వెళ్లాడు. చెరువులో స్నానం చేస్తుండగా జేసీబీతో తవ్విన గుంతలో పడి మునిగిపోయాడు. దీనిని గమనించిన స్నేహితులు గ్రామంలోకి వెళ్లి విషయాన్ని తెలుపటంతో వారు చెరువు వద్దకు చేరుకుని బాలుడిని బయటకు తీశారు. అనంతరం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందటంతో తల్లి దండ్రులు గుండెలవిసేలా రోదించారు. రూరల్ ఎస్సై లింబాద్రి ఆస్పత్రికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు.

కారు ఢీకొని ఒకరు..

జిన్నారం(పటాన్‌చెరు): వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి.. ఎదురుగా ఉన్న బైక్‌ను ఢీకొట్టింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. జిన్నారం ఎస్సై విజయకృష్ణ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామానికి చెందిన పుట్టి నర్సింలు(40) హైదరాబాద్ నుంచి బైక్‌పై సొంత గ్రామానికి బయలు దేరాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి ప్రధాన రహదారి మేడలమ్మ ఆలయ సమీపంలో కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నర్సింలుకు తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, సోలార్ బ్యాటరీలు చోరీ

గాంధారి: గాందారి శివారులో వ్యవసాయ బోరుబా వుల వద్ద నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు, అడవి పందులు, కోతుల నుంచి పంటలు రక్షించుకోడానికి అమర్చిన సోలార్ బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆదివారం రాత్రి గాంధారి శివారులోని చొదరి పల్లె వ్య వసాయ బోరు బావి వద్ద నుంచి గంద్యాటం సంగయ్యకు చెందిన ట్రాన్స్‌ఫార్మరుతో పాటు అదే ప్రాంతంలో బ్రాహ్మణ్‌పల్లి గ్రామానికి చెందిన మరో రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మరును ధ్వంసం చేసి అందులో నుంచి పరికరాలను ఎత్తుకెళ్లారు. గాంధారికి చెందిన రైతులు ముస్తఫా, గౌస్, మంగలి కిష్టయ్య, చిరుకూరి విఠల్ పొలాల వద్ద అమర్చుకున్న సోలార్ బ్యాటరీలను దుండగులు దొంగిలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ రెడ్డి తెలిపారు.

పందిమడుగులో ద్విచక్రవాహనం..

సిరికొండ: మండలంలోని పందిమడుగు గ్రామానికి చెందిన సుంకరిపల్లి సాయన్న ద్విచక్రవాహనం చోరీ అయిందని ఎస్సై నర్సింలు సోమవారం తెలిపారు. తన ఇంటి ముందు నిలిపి ఉంచిన స్కూటీ శనివారం రాత్రి చోరీకి గురైందని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు

ఎల్లారెడ్డి: ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదని పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక అన్నారు. సోమవారం పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 68వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. బాలికలు చదువులో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎంపీపీ మాధవి, కవి, జాతీయ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.